కొయ్యపేటలో డయేరియా

- ఆరు రోజుల్లో 18 మందికి అస్వస్థత
- వ్యాధి బారిన పడిన ఆశ కార్యకర్త
- ఇంకా అదుపులోకి రాని వ్యాధి
- గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు

పద్మనాభం: మండలంలోని నేరేళ్లవలస పంచాయతీ కొయ్యపేటలో డయేరియా వ్యాధి ప్రబలడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఆరు రోజుల నుంచి 18 మంది ఈ వ్యాధి బారినపడ్డారు. ఈ నెల నాల్గో తేదీన ముగ్గురికి, 5వ తేదీన ముగ్గురికి, 6వ తేదీన నలుగురికి, 7వ తేదీన నలుగురికి, 8వ తేదీన ముగ్గురికి, 9వ తేదీన ఒకరికి వ్యాధి సోకింది. ఇప్పటికీ ఇంకా వ్యాధి అదుపులోకి రాలేదు.

కొనసాగుతున్న వైద్య శిబిరం

ఈ నెల ఏడో తేదీ నుంచి రేవిడి పీహెచ్‌సీ సిబ్బంది గ్రామంలో వైద్య శిబిరం కొనసాగిస్తున్నారు. ఒక వైద్యాధికారి, ఒక ఎంపీహెచ్‌ఈవో, ఒక సూపర్‌వైజర్, ఒక ఏఎన్‌ఎం, ఒక మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, ముగ్గురు ఆశ కార్యకర్తలు శిబిరంలో సేవలందిస్తున్నారు.



కొయ్యపేటలో డయేరియా వ్యాధి బారినపడిన నారాయణమ్మ, ఆశ కార్యకర్త రమణమ్మ

ముగ్గురికి మహారాజా ఆస్పత్రిలో చికిత్స

ఈ నెల 5వ తేదీన డయేరియా సోకిన వారిలో ఆశ కార్యకర్త జి.రమణమ్మ ఉన్నారు. 8న జె.సత్యవతి, ఎన్.లక్ష్మి, ఎం.నారాయణప్పడు, 9న వృద్ధురాలు గండ్రేటి నారాయణమ్మ (80) వ్యాధి బారిన పడ్డారు. వీరిలో కొయ్య ఆదినారాయణతో పాటు ముగ్గురు విజయనగరం మహారాజా ఆస్పత్రిలో చికిత్స పొందారు. మిగతా వారు కొయ్యపేటలో చికిత్స పొందారు. గురువారం వ్యాధి సోకిన నారాయణమ్మకు గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో చికిత్స అందిస్తున్నారు.



ముురుగు నీటితో నిండిన చెరువు



కొయ్యపేటలో నిర్వహిస్తున్న వైద్యశిబిరం

క్షీణించిన పారిశుధ్యం

గ్రామంలో పారిశుధ్యం క్షీణించింది. గ్రామాన్ని ఆనుకుని ఉన్న చెరువు ఉంది. డ్రైనేజీల్లో నీరు చెరువులోకి చేరడంతో మురుగునీరుగా మారుతోంది. వర్షాలు పడినప్పుడు ఈ నీరు మళ్లీ డ్రైనేజీల్లోకి చేరడంతో అవి అధ్వానంగా తయారయ్యాయి. ముక్కుపుటాలు అదిరేలా తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో ఈగలు, దోమలు ముసురుకునేవి. డయేరియా వ్యాధి ప్రబలిన అనంతరం సచివాలయ సిబ్బంది డ్రైనేజీల్లో పూడిక తీయించారు. చెరువులో నీరు డ్రైనేజీల్లోకి రాకుండా సమీపంలోని పీతల కోనేరులోకి మళ్లించేందుకు చెరువుకు గండికొట్టారు. అయితే చెరువు పల్లంలో ఉండటం వల్ల నీరు పీతల కోనేరులోకి వెళ్లడం లేదు. గ్రామ ప్రవేశంలోని సైడు కాలువలోకి చెరువులో నీరు ఇంకా వెళ్తోంది.



మురుగు నీటి చెరువుకు కొట్టిన గండి



సైడు కాలువలో మురుగు నీరు

కుండీల్లో నీరు కలుషితం

విజయానందపురం జంక్షన్‌లో ఉన్న ట్యాంకులో నుంచి కొయ్యపేట ట్యాంకులోకి నీరు సరఫరా అవుతోంది. ఇక్కడి నుంచి గ్రామంలోకి పైపు లైను ద్వారా నీరు సరఫరా అవుతోంది. పైపు లైనుకు అనుసంధానంగా ఇంటింటి కుళాయిలను ఏర్పాటు చేశారు. కొన్ని ఇళ్లు ఎత్తులో ఉండడం వల్ల ఈ కుళాయిల ద్వారా నీరు రావడం లేదు. దీంతో ఈ కుళాయిలను తీసివేసి ఇళ్ల వద్ద లోతుగా కుండీలు ఏర్పాటు చేసుకుని, ఈ కుండీలోకి నీరు వెళ్లేలా గొట్టాలు ఏర్పాటు చేశారు. ఈ కుండీల్లో నీరు పట్టుకుని ప్రజలు తాగుతున్నారు. వర్షం వచ్చినప్పుడు చెత్త చెదారం ఈ కుండీల్లోకి వెళ్లిపోయి తాగునీరు కలుషితం అవుతోంది. దీని వల్ల డయేరియా వ్యాధి ప్రబలిందనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. డయేరియా ప్రబలిన అనంతరం కుండీల అడుగు భాగంలో గ్రామంలో ఇళ్ల ముందు, సైడు కాలువల వద్ద బ్లీచింగ్ చల్లారు.



తాగునీటి కోసం ఇంటికి దిగువన ఏర్పాటు చేసుకున్న కుండీ



ఇళ్ల ముందు జల్లిన బ్లీచింగ్

నీటి నమూనాలు పరీక్షలకు పంపించాం

కొయ్యపేటలో నీటి శాంపిల్స్ తీసి పరీక్షల కోసం విశాఖపట్నంలోని రీజనల్ ల్యాబొరేటరీకి పంపించాం. మోషన్ శాంపిల్స్‌ను పరీక్షల కోసం కేజీహెచ్‌కు పంపించాం. రిపోర్టులు రావాల్సి ఉంది. డయేరియా అదుపులోకి వచ్చేవరకు గ్రామంలో వైద్యశిబిరాన్ని కొనసాగిస్తాం.

– కె.లీలా ప్రసాద్, రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి

'దళిత రైతుల భూములు గూగుల్ టెక్‌కు కేటాయించొద్దు'



తర్లువాడలో రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

తగరపువలస: ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీలోని దళితరైతుల పచ్చటి భూములు గూగుల్ టెక్‌కు కేటాయించవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. అయిదు దశాబ్దాలుగా తోటపంటలు, కూరగాయలు సాగు చేసుకుంటున్న భూములను సంస్థలకు కేటాయించడం సరికాదన్నారు. గురువారం ఆయన పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం, భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తితో కలిసి దళితుల సాగులో ఉన్న భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో 480 ఎకరాల భూములను గూగుల్, సీఎఫ్, రైడెన్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి సంస్థలకు కూటమి ప్రభుత్వం అప్పగించే ప్రయత్నం చేస్తోందన్నారు. వీటిలో తర్లువాడలో 200 ఎకరాలు, అచ్యుతాపురం, రాంబిల్లి ప్రాంతాలలో 160 ఎకరాలు, అడవి వరంలో 120 ఎకరాలు ఉన్నాయన్నారు. పర్యావరణానికి ముప్పు కలిగించి, రైతుల ఉపాధికి గండికొట్టే ఇలాంటి విధానాలు ప్రభుత్వం మానుకోవాలన్నారు. రైతులకు తెలియకుండా తీర్మానాలు, భూసార పరీక్షలు, నష్ట పరిహారాలు సరికాదన్నారు. వీటిని వ్యతిరేకిస్తూ రైతులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

జెడ్పీ పరిశీలన

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్ట వద్ద స్వీట్స్ తయారీ కేంద్రం నుంచి వెలువడుతున్న వ్యర్థాలపై ఇటీవల స్థానికులు కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై భీమిలి జెడ్పీ ఒమ్మి అయ్యప్పనాయుడు గురువారం ఉదయం సిబ్బందితో బంగ్లామెట్టలో పర్యటించి ఫిర్యాదు ఇచ్చిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన స్థానికులతో మాట్లాడుతూ స్వీట్స్ తయారీ సంస్థకు నోటీసు ఇచ్చి, సమస్యను పరిష్కరిస్తామని అక్కడివారికి హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

తగరపువలస: ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఆనందపురం జెడ్పీ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులు డి.సాయితేజ, డి.దీక్షిత్ ఎంపికయ్యారు. వీరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా గురువారం ఈ విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

తల్లీబిడ్డల ఆరోగ్యానికి పోషకాహారం అవసరం



సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

తగరపువలస: తల్లీబిడ్డల ఆరోగ్యానికి పోషకాహారం అవసరమని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. భీమిలి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన 8వ రాష్ట్రీయ పోషకమాసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించి, పౌష్టికాహార వస్తువులు వారికి అందించారు. అనంతరం జీవీఎంసీ భీమిలి జోన్ 1,2 వార్డులకు సంబంధించి రూ.1.12 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పథకాలకు గ్రంథాలయవీధిలో శిలాఫలకాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనుబాబు, ఐసీడీఎస్ పీవో శ్రీనుబాబు, కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హరేకృష్ణ వైకుంఠంలో ప్రత్యేక పూజలు



తన్మయంతో నృత్యం చేస్తున్న భక్తులు

తగరపువలస: దామోదర దీపోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆనందపురం మండలం గంభీరంలోని హరేకృష్ణ వైకుంఠంలో హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు తన్మయత్వంతో నృత్యం చేశారు. భక్తులు స్వయంగా దామోదరునికి నెయ్యి దీపాలు సమర్పించారు. దామోదర అష్టకానికి లయబద్ధంగా ఆడుతూ సంగీత వాయిద్యాలతో భజనలు చేశారు. నెలరోజుల పాటు జరిగే దామోదర ఉత్సవాన్ని జయప్రదం చేయాలని హరేకృష్ణ మూమెంట్ ప్రతినిధి అంబరీష దాస కోరారు.

మధ్యాహ్న భోజన కార్మికురాలి ఆందోళన



పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న రాంబాయి

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస ప్రాథమిక పాఠశాలలో తనకు మధ్యాహ్న భోజన కార్మికురాలిగా అవకాశం ఇవ్వాలని బోని రాంబాయి అనే మహిళ గురువారం ఆందోళన చేపట్టింది. గతంలో ఎన్నో సంవత్సరాలు ఇదే పాఠశాలలో పని చేసిన తనకు కాకుండా ఈశ్వరమ్మ అనే మరో మహిళకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ అవకాశం ఇవ్వడంతో ఆమె కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ స్కూల్ కమిటీ, తల్లిదండ్రులు కూడా ఈశ్వరమ్మ వైపే మొగ్గు చూపి, ఎంఈవో శివరాణి సమక్షంలో తీర్మానం చేసి పంపారు. దీంతో తనకు అన్యాయం జరిగిందంటూ ఆమె పాఠశాల ముందు నిరసన వ్యక్తం చేశారు.

సంపత్ వినాయగర్ హుండీల ఆదాయం రూ.22.21 లక్షలు

మహారాణిపేట : ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ దేవాలయం హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 33 రోజులకు గాను రూ.22,21,967, వెండి 153 గ్రాములు లభించిందని ఈవో, సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ చోళన్ తెలిపారు. యూఎస్‌ఏ డాలర్స్ 76, కెనడా డాలర్స్ 10 వచ్చాయన్నారు. ఆదాయ లెక్కింపును శ్రీ విష్ణేశ్వర స్వామి దేవాలయం ఈవో కీర్తి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

నేటి నుంచి బోధనేతర పనులు చేయం

'ఫ్యాప్టో' ప్రతినిధుల వెల్లడి



ఎంఈవో జోగేంద్రనాథ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆనందపురం మండల ఫ్యాప్టో నాయకులు

తగరపువలస: ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఫ్యాప్టో) రాష్ట్ర నాయకత్వం సూచనల మేరకు ఈ నెల 10 నుంచి పాఠశాలల్లో బోధనేతర పనులు చేయబోమని ఆర్గనైజేషన్ ఆనందపురం మండల నాయకులు నిర్ణయించారు. ఈ మేరకు ఎంఈవో జోగేంద్రనాథ్‌కు గురువారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీపీటీఏ జిల్లా అధ్యక్షుడు, ఫ్యాప్టో మండల చైర్మన్ బి.కేశవరావు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అంబేడ్కర్, మండలంలోని వివిధ ఉపాధ్యాయ సంఘాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వ శిక్షణ కోసం దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ-లీగల్ : జిల్లాలో 40 గంటల మధ్యవర్తిత్వ శిక్షణ కోసం అర్హులైన సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు, సబ్జెక్టు నిపుణులు నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. అర్హులైన అభ్యర్థుల జిల్లాలో గల సంబంధిత న్యాయవాదులు సంఘం నుంచి జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

జగనన్నకు మద్దతుగా..

భారీ సంఖ్యలో మాకవరపాలెం తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

తగరపువలస: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పోరాటానికి మద్దతు తెలుపుతూ భీమిలి నియోజకవర్గం నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో నర్సీపట్నం తరలివెళ్లారు. నర్సీపట్నంలోని మాకవరపాలెంలో అసంపూర్తిగా ఉన్న మెడికల్ కళాశాల సందర్శనకు తమ ప్రియతమ నేత వస్తున్న సందర్భంగా వందలాది మంది నాయకులు వాహనాలలో తరలి వెళ్లారు.

జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు, ఆటో కార్మికులు తరలి వెళ్లారు. రెండోవార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య నాయకులు బింగి హరికిరణ్‌రెడ్డి, జీరు వెంకటరెడ్డి, డబ్బీరు ప్రశాంతి, చిప్పాడ వెంకటేష్, గుండాసి మధునాయుడు తదితరులు వెళ్లారు. వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో తగరపువలస నుంచి వంశీరెడ్డి, చిల్ల సూర్యనారాయణరెడ్డి, పీతల వెంకట అప్పారావు తదితరులు ఉన్నారు. ఆనందపురం మండలం నీళ్లకుండీల నుంచి వైస్ ఎంపీపీ పాండ్రంగి శ్రీను, షిణగం అప్పలరాజు, రౌతు శ్రీను, పల్లా రమణ తదితరులు ఉన్నారు. మామిడిలోవ పంచాయతీలోని దబ్బంద నుంచి జోల ఆనంద్ ఆధ్వర్యంలో పలువురు మాకవరపాలెం వెళ్లారు. భీమిలి మండలం నుంచి ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారు నాయుడు, పార్టీ మండలఅధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తరలి వెళ్లారు.



భీమిలి జోన్ రెండో వార్డు నుంచి తరలి వెళ్తున్న నాయకులు

5,7,8 వార్డుల నుంచి..

కొమ్మాది: జీవీఎంసీ 5,7,8 వార్డుల నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. ముందుగా కార్యకర్తలు, ముఖ్య నాయకులు ఎండాడలోని పార్టీ కార్యాలయం వద్దకు ఉదయం 8.30 గంటలకు చేరుకున్నారు. అక్కడి నుంచి భీమిలి నియోజకవర్గ నాయకులందరూ వేపగుంట చేరుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద నగరాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, వార్డు అధ్యక్షులు పోతిన హనుమంతురావు, గుడ్ల పోలిరెడ్డి జెండా ఊపి బైక్ ర్యాలీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు వంకాయల మారుతీప్రసాద్, జీఎస్ రెడ్డి, పోతిన సురేష్, మాదు బుజ్జి, ఇతర ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



ఒకటోవార్డు బాలాజీనగర్ నుంచి వెళ్తున్న నాయకులు



తగరపువలస నుంచి వెళ్తున్న రెండోవార్డు నాయకులు



ఆనందపురం మండలం నీళ్లకుండీల నుంచి బయల్దేరిన నాయకులు



మాకవరపాలెం వెళ్తున్న భీమిలి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

4వ వార్డు నుంచి..

జీవీఎంసీ 4వ వార్డు నుంచి కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. కాపులుప్పాడ, చేపలుప్పాడ, కె. నగరపాలెం, నిడిగట్టు, జేవీ అగ్రహారం ప్రాంతాల నుంచి నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలి వెళ్లారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు పాల రమణారెడ్డి, మేరుగు చిన్నారావు, రామకృష్ణ, ముదునూరి అప్పలరాజు, వేముల ఈశ్వర్‌రెడ్డి, సాడి రమణ, ఎరుసు అప్పలకొండ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం నుంచి..

పద్మనాభం: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నం పర్యటనకు పద్మనాభం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావుతో పాటు అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలివెళ్లారు.

ఆరో వార్డు నుంచి..

పీఎం పాలెం: మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మాకవరపాలెం పర్యటనకు ఆరో వార్డు నుంచి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. వారిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గాదె రోశిరెడ్డి, పోతిన ప్రసాద్, పిల్లా సుజాత, పోతిన సూరిబాబు, నరసింహరావు, వాండ్రాసి వెంకటప్పారావు, పోతిన ఎల్లాజీ, పిల్లా రమణ, జామి శివ, మడక ఈశ్వరరావు, మీనా వరలక్ష్మి, రాజేశ్వరి తదితర నాయకులున్నారు.



జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నగరాల కార్పొరేషన్ మాజీ చైర్మన్ పోతిన శ్రీనివాస్



బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న వార్డు అధ్యక్షులు పోతిన హనుమంతురావు, గుడ్ల పోలిరెడ్డి



పద్మనాభం నుంచి నర్సీపట్నం తరలి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పద్మనాభం నుంచి ర్యాలీగా బయల్దేరిన ఆరోవార్డు నాయకులు, కార్యకర్తలు

బాలికల సంరక్షణ అందరి బాధ్యత



అమ్మాయిలను రక్షించడం, చదివించడంపై కస్తూర్బా విద్యార్థిని వేసిన బొమ్మ

పద్మనాభం: అమ్మాయిలను చదివించడం, సురక్షితంగా ఉంచడమే నిజమైన అభివృద్ధి అని ఎంఈవో పి.రమణ అన్నారు. వారి సంరక్షణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని కస్తూర్బా విద్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మగ పిల్లలతో పాటు ఆడపిల్లలు కూడా అన్ని రంగాల్లో ముందుకు వెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా అమ్మాయిలను చదివించడం, రక్షించడం తదితర అంశాలపై నిర్వహించిన వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ అంశంపై బి.యోగ్యత వేసిన బొమ్మ అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గ్రేస్ లిల్లీ పాల్గొన్నారు.



పాఠశాల వద్ద బాలికాదినోత్సవంలో పాల్గొన్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

భీమునిపట్నం: బాలికలు బాగా చదువుకుని, అన్ని రంగాల్లో రాణించాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రమణ అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆడపిల్లలు బాగా చదువుకుని, అన్ని రంగాల్లో ముందుంటూ ప్రతిభ చూపుతున్నారన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు పొందుతున్నారని, ఇది మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. మీరు కూడా అదేవిధంగా రాణించాలని ఆకాంక్షించారు. ఏమైనా సమస్యలు ఎదురైనా అధైర్యపడకుండా ఎదుర్కోవాలని సూచించారు. ఈ సందర్భంగా వారికి సేవ్ చైల్డ్ ట్రాఫికింగ్‌పై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

9 నెలలుగా వదిలేశారిలా..

తగరపువలస: ఆనందపురం మండలం రామవరం పంచాయతీలో 9 నెలల క్రితం ఏర్పడిన గుంత స్థానికులను కలవరపాటుకు గురి చేస్తోంది. రహదారికి సగం తెగిపోయి ఏర్పడిన గుంతలో ఎప్పుడెవరు పడిపోతారోనని ఆందోళన చెందుతున్నారు.ఈమార్గంలో నిత్యం 10 గ్రామాల ప్రజలతో పాటు విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక రాత్రివేళల్లో ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా ఉందని చెబుతున్నారు. ఈ గుంతను పూడ్చాలని స్థానికులు 9 నెలలుగా మొర పెట్టుకుంటున్నా ఇక్కడి సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు, మండల పరిషత్ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రామవరంలో 9 నెలలుగా పూడ్చని గుంత

ఈఎస్‌ఐ పథకాలపై కార్మికులకు అవగాహన



మాట్లాడుతున్న ఈఎస్‌ఐ అసిస్టెంట్ డైరెక్టర్ వేమూరి శ్యాంప్రసాద్

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ దివీస్ లేబొరేటరీలో గురువారం ఈఎస్‌ఐ కార్పొరేషన్ కొత్త సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా 'స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయీస్' గురించి ఈఎస్‌ఐ అసిస్టెంట్ డైరెక్టర్ వేమూరి శ్యాంప్రసాద్ తెలియజేశారు. ఈ పథకం కాల పరిమితి ఈ ఏడాది జూలై 1 నుంచి డిసెంబరు 31 వరకు ఉంటుందన్నారు. ఇప్పటి వరకు ఈఎస్‌ఐలో నమోదు కాని కర్మాగారాలు, సంస్థలు ప్రకటించిన తేదీ నుంచి నమోదు చేసుకుంటే అప్పటి నుంచే ఈ పథకం వర్తిస్తుందని తెలియజేశారు. పాత కాలానికి ఎలాంటి చందాలు, డ్యామేజీలు విధించబడవన్నారు. ఇది వరకే నమోదైన సంస్థలలో ఎవరైనా కార్మికులు నమోదు కాకపోతే తాము ప్రకటించిన తేదీ నుంచి నమోదు చేసుకోవచ్చన్నారు. న్యూ అమ్నెస్టీ పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో ఈఎస్‌ఐ సూపరింటెండెంట్ పి.శ్రీనివాస్, మేనేజర్ అజీజ్ బేగ్, దివీస్ జనరల్ మేనేజర్లు వైఎస్ కోటేశ్వరరావు, ఎంఎస్‌ఎన్ రావు పాల్గొన్నారు.